సాక్షి
నారాయణపేట

శుక్రవారం । 21 । జూలై । 2023



'శిథిల' పిడుగు

పాలమూరులోని బాలికల జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది.

వివరాలు 8లో ▸



విడిపోయిన బోగీలు

జిల్లాలోని ఆరేపల్లి స్టేషన్ వద్ద రన్నింగ్‌లో ఉన్న గూడ్స్ రైలు బోగీలు విడిపోయాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.4 /23.2

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రోజంతా ముసురు వర్షంతో పాటు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్



నారాయణపేట: అడిషనల్ కలెక్టర్‌గా (రెవెన్యూ) పి.అశోక్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కోస్గి: పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్ తర్వాత మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు తీసుకుంటున్నామని కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, 28న ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులతోపాటు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కోస్గి కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని, స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల్లో పాలిసెట్ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు స్థానిక కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి



మక్తల్: ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఉండాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి కృష్ణమాచారి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలో బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు నోట్‌బుక్కులు, దుప్పట్లు అందజేశారు. అనంతరం వసతిగృహంలో పరిసరాలు, మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల రాకుండా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బయటికి వెళ్లి వర్షంలో తడవకుండా ఉండాలని చెప్పారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా వడ్డించాలని వంట ఏజెన్సీ కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ మాసూం ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

నారాయణపేట రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాల నుంచి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో సూచించారు. నిరంతరం జిల్లాలోని అన్ని పీఎస్‌ల పరిధిలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి వైర్‌లెస్ ద్వారా సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. ముసురు వర్షాలకు పాత కట్టడాలు, శిథిల భవనాలు కూలిపోయే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దూరంగా ఉండాలన్నారు. ప్రయాణాలు రద్దు చేసుకోవాలని, అత్యవసరమైతే తగిన జాగ్రత్తలతో వెళ్లాలని సూచించారు. రైతులు పొలాల వద్ద బోరుమోటార్ల విషయంలో నిర్లక్ష్యంగా వినియోగించరాదని, చెట్లకింద సేద తీరడం ప్రమాదకరమని, నది పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, కాజ్‌వేలపై నీరు వెళ్తుంటే వాహనాలు, నడక ద్వారా ప్రయాణం చేయరాదని పేర్కొన్నారు. నీటి పరివాహక ప్రాంతాల్లో ఫొటోలు, సెల్ఫీలు, వీడియోల చిత్రీకరణ సమయంలో జాగ్రత్తలు అవసరమని, పోలీసు సిబ్బంది ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకుపోవాలని తెలిపారు.

మొహర్రం వేడుకకు బందోబస్తు

జిల్లాలో మొహర్రం వేడుకలకు ఆయా పీఎస్‌ల ద్వారా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అదే ఆచారాన్ని కొనసాగించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 276ప్రాంతాల్లో పీర్లను ప్రతిష్ఠిస్తున్నారని, మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని, భక్తులు సహకరించాలని కోరారు.

ఎవరు మింగారు.. ఏం చేస్తున్నారు?

- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ స్థలంలో వెలసిన వెంచర్లపై ఆరా
- పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశాలు
- రంగంలోకి దిగిన నారాయణపేట ఆర్డీఓ రాంచందర్‌నాయక్
- నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోకుండానే డీటీసీపీ ఆమోదం
- టౌన్ ప్లానింగ్ శాఖకు ఫిర్యాదు చేశామంటున్న ఇరిగేషన్ అధికారులు
- సంచలనం సృష్టించిన 'సాక్షి' కథనం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కోయిల్ సాగర్ లింక్ కెనాల్ కోసం మరికల్, ఎలిగండ్ల శివారులో రైతుల వద్ద ప్రభుత్వం సేకరించిన స్థలం అన్యాక్రాంతంపై 'లింక్ కెనాల్‌ను మింగేశారు!' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనం ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. స్పందించిన నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో స్వయంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఎవరు మింగారు.. మీరేం చేస్తున్నారు.. అని ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. తీలేరు పంప్‌హౌస్ నుంచి లింక్ కెనాల్‌కు సేకరించిన భూములు సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో చెక్ చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. 52, 87, 731 మాత్రమే కాదు.. కెనాల్ కోసం భూసేకరణ చేసిన అన్ని సర్వే నంబర్లలో క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఎక్కడెక్కడ వెంచర్లు వెలిశాయి.. వాటికి అనుమతులు ఎవరు ఇచ్చారు.. వీటితో పాటు ఎక్కడెక్కడ ఆక్రమణకు గురైందో వివరాలు సేకరించాలని చెప్పినట్లు వినికిడి. ఎవరు ఆక్రమించారనే దానిపైనా విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు రంగంలోకి దిగిన ఆర్డీఓ రాంచందర్‌నాయక్ మరికల్ తహసీల్దార్ రాంకోటి నుంచి ప్రాథమికంగా వివరాలు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయి విచారణలో జాప్యం చోటు చేసుకుంటున్నట్లు సమాచారం.



లింక్ కెనాల్‌ను మింగేశారు!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం



సాక్షి ఎఫెక్ట్..

ఎన్‌ఓసీ లేకుండానే డీటీసీపీ అనుమతులు

మరికల్ శివారులోని 52, 87, 731 సర్వే నంబర్లలో వెలిసిన వెంచర్లకు సంబంధించి తమ శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోలేదని.. డీటీసీపీ వాళ్లు మాత్రం లేఅవుట్‌కు అనుమతులు ఇచ్చారని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశామని వెల్లడించినట్లు తెలిసింది. దీంతో ఈ భూబాగోతం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని అప్పటి అధికార యంత్రాంగంతో పాటు సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశించిన క్రమంలో రూ.3 కోట్ల విలువైన భూమిపై ఆశలు వదులుకోవాల్సిందేనా అనే భయం ఆక్రమించిన రియల్టర్లలో నెలకొంది.

స్కూల్ డ్రెస్ ఏదీ?

బడి ప్రారంభమై నెలన్నర గడిచినా అందని వైనం

- ఇంకా మిషన్‌పైకి ఎక్కని 85శాతం క్లాత్
- స్థానికేతరులకు ఇవ్వడమే ఆలస్యానికి కారణమా?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నేటికీ యూనిఫామ్స్ అందలేదు. పాఠశాలలు తెరిచిన తొలిరోజే పుస్తకాలతో పాటు యూనిఫామ్స్‌ను పిల్లల చేతికి ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. దీనికి అనుగుణంగా కావాల్సిన వస్త్రాన్ని వేసవి సెలవులకు ముందే జిల్లాలకు చేరవేశారు. అయితే జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులకు సమన్వయం లేక, ఇష్టారీతిగా ఏజెన్సీలకు కట్టబెట్టడంతో ఇప్పటికీ అందించలేకపోయారు. ఈ పరిస్థితిపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



శేర్నపల్లిలో సివిల్ డ్రెస్‌లో పాఠశాలకు హాజరైన విద్యార్థులు



పాఠశాలలు	515
బాలికలు	34,739
బాలురు	32,745
కుట్టాల్సిన దుస్తులు (జతలు)	67,439

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా 22 ప్రభుత్వ, 478 లోకల్‌బాడీ (జెడ్పీ, మండల పరిషత్), రెండు ఎయిడెడ్, 11 కేజీబీవీ, రెండు మోడల్ స్కూల్‌లతో కలిపి 515 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 32,745మంది బాలురు, 34,739మంది బాలికలతో కలిపి 67,484మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ కుట్టి అందిస్తుంది. బాలురకు రెండు ప్యాంట్లు, రెండు షర్టులు, బాలికలకు చుడిదార్ రెండు జతలు ఇస్తారు. దీనికిగాను గత ఏప్రిల్‌లోనే అవసరమైన బట్టను జిల్లా కేంద్రాలకు పంపింది.

టెండర్, నోటిఫికేషన్ లేకుండానే..

ప్రభుత్వ కార్యాలయంలో ఏ పనికైనా తప్పనిసరిగా నోటిఫికేషన్ ఇవ్వాలి. దీనికి సంబంధించి టెండర్ కాల్ ఫర్ చేయాలి. అలాంటిది ఏమీ లేకుండానే తమకు కావాల్సిన ఏజెన్సీలకు కట్టబెట్టారు. వాస్తవానికి ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడానికి వారు చదువుతున్న పాఠశాల ఏ ప్రాంతంలో ఉంటే అక్కడి స్థానికులకే ఇవ్వాలి. కానీ ఇక్కడ మాత్రం గ్రామం, మండలం దాటి ఇతర జిల్లా వారికి అప్పగించారు. ప్రభుత్వం నుంచి యూనిఫామ్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్ వచ్చిన వెంటనే గతంలో కుట్టిన ఏజెన్సీ నిర్వాహకులు డీఈఓ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జ్‌ని కలుసుకున్నారు. దీంతో వారికే ఒక్కొక్కరికీ రెండు, మూడు మండలాలు కేటాయించి వస్త్రాన్ని అప్పగించారు. దీనిపై స్థానిక దర్జీలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. యూనిఫామ్స్ విభాగం చూసే సెక్టోరియల్ అధికారి మారడంతో ఒకరిపై మరొకరు నెట్టుకుని తప్పించుకుంటున్నారు.

15శాతం యూనిఫామ్స్ పూర్తి..

జిల్లాకు సంబంధించి 67,484మంది విద్యార్థులకు యూనిఫామ్స్ అందించడానికి 3,24,619 మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం ఏప్రిల్‌లోనే సరఫరా చేసింది. దీన్ని ఇష్టారీతిగా ఏజెన్సీలకు కట్టబెట్టడంతో వారు ఒకటికి రెండు జిల్లాల్లో పనులు పొంది కుట్టడంలో ఆలస్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన నాగరాజుకు ధన్వాడ, దామరగిద్ద, మక్తల్ మండలాలకు చెందిన స్కూల్స్, ప్రహ్లాద్‌కు కోస్గి, కృష్ణా, మద్దూర్ మండలాలు, సౌధామినికి మరికల్, నర్వ, బాలుకు నారాయణపేట, ఊట్కూర్ మండలాలు కేటాయించారు. మాగనూర్ మండలం మాత్రం డీఆర్‌డీఏ (మహిళా సంఘాలకు) కేటాయిస్తే వారు సైతం ప్రహ్లాద్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇలా ఇష్టారీతి కేటాయింపులతోనే యూనిఫామ్స్ రాలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటివరకు కుట్టాల్సిన యూనిఫామ్స్‌లో 15శాతం మాత్రమే కుట్టడం పూర్తికాగా, ఒక్కొక్కరికీ రెండు జతలు ఇవ్వాల్సిన చోట ఒక్కొక్కటి అందించి వాటిని 30శాతం మంది విద్యార్థులకు సరిపెట్టారని తెలుస్తోంది.

నారాయణపేట మండలంలో ఇలా..

- కోటకొండ జెడ్పీ స్కూల్‌లో 610మంది విద్యార్థులు 6నుంచి 10వ తరగతి తెలుగు, ఇంగ్లిష్ మీడియం చదువుతున్నారు. వీరికి ఈ విద్యా సంవత్సరంలో యూనిఫామ్స్ రాలేదు. కొంతమందికి దుస్తులు చిరిగిపోవడంతో సివిల్ డ్రస్‌తో తరగతులకు హాజరవుతున్నారు. నెలన్నర అవుతున్నా ఒక్కరికి ఒక్కజత కూడా పంపిణీ చేయలేదు.
- శేర్నపల్లి యూపీఎస్‌లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 260మంది విద్యార్థులు ఉన్నారు. వీరికిసైతం ఈఏడాది ఒక్క యూనిఫామ్ జత కూడా ఇవ్వలేదు. దీంతో సివిల్ డ్రెస్‌లతోనే పాఠశాలకు హాజరవుతున్నారు.
- శ్యాసన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 112 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి 15రోజుల క్రితం ఒక జత మాత్రం యూనిఫామ్స్ అందించారు. ప్రతిరోజు అదే బట్టలు వేసుకుని వస్తున్నారు.

సమస్యను అధిగమిస్తాం..



జిల్లాలో యూనిఫామ్స్ పంపిణీ విషయంలో పనులు వేగవంతం చేస్తున్నాం. నేను రాకపూర్వం యూనిఫామ్స్ కుట్టేందుకు ఏజెన్సీలకు అప్పగించారు. వారి నుంచి తొందరగా కుట్టించి విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. దర్జీలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. మండలాలకు నేరుగా యూనిఫామ్స్ వెళ్లడంతో పూర్తి డాటా తీసుకోవాల్సి ఉంది.

– రవీందర్, డీఈఓ

కూలి తక్కువ ఉందని వాదన..

వాస్తవానికి ఒక జత (డ్రస్) కుట్టడానికి అయ్యే ఖర్చు బయటి ధర కంటే చాలా తక్కువగా ఇస్తున్నారని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. ప్రైవేట్‌గా కుడితే రూ.500 కంటే ఎక్కువ వస్తాయని, ప్రభుత్వం కేవలం రూ.50మాత్రమే చెల్లిస్తుందని తెలిపారు. ఇది సరిపోవడం లేదంటున్నారు. ఈసారి కొత్త తరహాలో కుట్టాలని ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇచ్చారు. గౌను పట్టీలు, కార్‌పట్టీలు, క్లాపులు, క్లిప్పులు ఇలా డిజైన్ చేయాలంటే ఎక్కువ శ్రమ అవసరమవుతుందని, సమయం ఎక్కువ పడుతుందని అంటున్నారు. కొన్నిచోట్ల పాత విధంగానే పూర్తి చేసి పంపిణీ చేసినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో మనోళ్లు..

- రేవంత్‌తో పాటు ఉమ్మడి పాలమూరు నుంచి మరో ముగ్గురికి చోటు
- సభ్యులుగా సంపత్, వంశీచంద్‌రెడ్డి
- ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా శివసేనారెడ్డి



సంపత్‌కుమార్



వంశీచంద్‌రెడ్డి



శివసేనారెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. కర్ణాటకలో హస్తం విజయకేతనం ఎగురవేయగా.. ఆ తరహాలోనే తెలంగాణలో సైతం అధికారంలోకి వస్తామనే ధీమా ఆ పార్టీ నేతల్లో నెలకొంది. ఈ క్రమంలో ముఖ్య నేతల చేరిక.. మారుతున్న రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. అయితే ఎన్నికల పోరులో ఎలాంటి సమస్యలు లేకుండా.. పకడ్బందీగా వ్యవహరించాలనే ఉద్దేశంతో ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే పలు కమిటీలను నియమించింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిటీని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ గురువారం ప్రకటించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చైర్మన్‌గా, 25 మంది సభ్యులతో పాటుమరో ముగ్గురిని ఎక్స్ అఫీషియో మెంబర్లుగా నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇందులో కల్వకుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ సంపత్‌కుమార్ సభ్యులుగా.. వనపర్తి నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డికి ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ప్రాతినిధ్యం దక్కింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆ పార్టీ శ్రేణుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

టీఎల్‌ఎంతోనే సమగ్ర విద్యాబోధన



వీవీప్యాట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష అధికారులు

నారాయణపేట రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలలో విద్యాబోధన చేసే సమయంలో తప్పకుండా టీఎల్‌ఎంను ఉపయోగించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎఫ్‌ఎల్‌ఎన్‌కు అనుబంధంగా తయారు చేసిన టీఎల్‌ఎంను గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల విద్యా విద్యా సామర్థ్యాల పెంపునకు పాఠ్యపుస్తకానికి సమాంతరంగా టీచింగ్–లర్నింగ్ మెటీరియల్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఇటీవల జిల్లాలో అమలు చేస్తున్న వెలుగు కార్యక్రమ అభ్యాస దీపికలను వివరించడానికి టీఎల్‌ఎం ఎంతో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనిచేయాలి

నారాయణపేట: ఎన్నికల నిబంధనల ప్రకారం నోడల్ అధికారులు పనిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధి నిర్వహణపై నోడల్ అధికారులకు కలెక్టర్ తగు సూచనలు చేశారు. మెటీరియల్ మేనేజ్‌మెంట్ , కంప్యూటర్ రిజిస్ట్రేషన్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్ , లా అండ్ ఆర్డర్, ఈవీఎం మేనేజ్‌మెంట్ ఎంసీసీ, మానిటరైజేషన్, బ్యాలెట్ బాక్స్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా ఓటు వినియోగంపై జిల్లాలో ప్రతి ఒక్కరికీ స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గురువారం ప్రజావాణిహాల్‌లో అవగాహన సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన, జాగ్రత్తలపై కలెక్టర్ సూచించారు. అవగాహన కల్పించే దిశగా మక్తల్ నియోజకవర్గంతో పాటు ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎం అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ పి.అశోక్‌కుమార్, ఆర్డీఓ పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

ప్రభుత్వం కల్పించే సదుపాయాలతో విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. గురువారం పట్టణంలోని శాతవాహన కాలనీలో బీసీ సంక్షేమ వసతిగృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతులపై అడిగితెలుసుకున్నారు. వంటగది, డైనింగ్ హాల్, మరుగుదొడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యవంతమైన భోజనం వండి పెట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు.

జోరువానతో జలమయం!



కోస్గి: ఎడతెరపి లేకుండా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలుకాలనీలు జలమయంగా మారాయి. మున్సిపల్ పరిధిలో నేటికీ డ్రెయినేజీ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం, కొన్ని కాలనీల్లో అసంపూర్తిగానే వదిలేయడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. కోస్గిలోని బృందావన్ కాలనీ, బీసీ కాలనీల్లో పలు ఇళ్లలోకి వర్షంనీరు చేరింది. మండలంలో బుధవారం రాత్రి 15.0 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ముశ్రీఫా, బిజ్జారం చెక్ డ్యాంలు అలుగుపారుతున్నాయి. ముంగిమళ్ల, ముక్తిపాడ్, ముశ్రీఫా, బిజ్జారం, కడంపల్లి వాగులు జలకళను సంతరించుకున్నాయి.

ధాన్యం రవాణా డబ్బులు దుర్వినియోగం

- నర్వ సింగిల్ విండోలో రూ.3లక్షల చొప్పున తీసుకున్న డైరెక్టర్లు
- మాజీ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

మరికల్: నర్వ సింగిల్ విండో కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలను మాజీ విండో చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి బయటపెట్టారు. నర్వ మండలం పరిధిలో మూడేళ్లలో ఆరుసార్లు సీజన్ వారీగా ధాన్యం కొనుగోలు చేయగా వాటికి సంబంధించిన రవాణా ఖర్చులు మూడు దఫాలుగా రూ.45లక్షలు అందాయి. వీటిని రైతులకు పంచాలని చైర్మన్ పాలకవర్గ సభ్యులతో పలుమార్లు చర్చించారు. ఇందుకు వారు ససేమిరా అంటూ ఒక్కో డైరెక్టర్ రూ.3లక్షల చొప్పున తీసుకున్న విషయం నిజం కాదంటూ మరికల్ మండలం చిత్తనూర్‌లో గురువారం బహిరంగ చర్చ నిర్వహించారు. ఈ చర్చకు నూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్‌తో సహా పాలకవర్గ సభ్యులు రావాలని కోరారు. కానీ చర్చకు ఎవరూ కూడా హాజరుకాకపోవడంతో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మూడేళ్లలో తాను చైర్మన్ ఉండి ఆరు దఫాలుగా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రవాణా ఖర్చులు రూ.45లక్షలు వచ్చాయని అన్నారు. వీటిని ఆయా డైరెక్టర్ల పరిధిలోని రైతులకు ఇవ్వాలని పలుమార్లు పాలకవర్గంతో సమావేశం ఏర్పాటు చేయగా, వారు ఒప్పుకోలేదన్నారు. ఒక్కో డైరెక్టర్ రైతులకు సంబంధించిన రవాణా ఖర్చులను రూ.3లక్షల చొప్పున తీసుకున్నట్లు తెలిపారు. కచ్చితంగా రైతులకు ఇవ్వాలని చెబితే తనపై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించారన్నారు. ఎందుకు చిత్తనూర్‌లో బహిరంగ చర్చ ఏర్పాటు చేయడం జరిగిదంటే ప్రభుత్వం నుంచి వచ్చిన రవాణా డబ్బులు చిత్తనూర్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఖాతాలో రూ.25లక్షలు, వైస్ చైర్మన్ రాములు ఖాతాలో రూ.20లక్షలు జమ చేయించడం జరిగిందన్నారు. తనకు వచ్చిన డబ్బులను తీసుకోకుండా కార్యాలయం అకౌంట్‌లో జమ చేసి తన పదవికి రాజీనామా చేసి రైతుల పక్షాన పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తరలించిన రవాణా డబ్బులు ఇవ్వకుంటే నర్వ విండో కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేసేందుకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, మురళి, భాస్కర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డితో పాటు రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ, డీసీఎం ఢీ : ఇద్దరి దుర్మరణం



పెబ్బేరు: పట్టణ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి లారీ, డీసీఎం ఢీకొని ఇద్దరు మృతిచెందినట్లు ఎస్ఐ జగదీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన రైతు రామకృష్ణ (39), డీసీఎం యజమాని, రైతు చిన్న లక్ష్మన్న (42) ఇద్దరూ కలిసి డీసీఎంలో గోకరకాయ సంచులు వేసుకొని బుధవారం రాత్రి హైదరాబాద్ మార్కెట్‌కు బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై కడప నుంచి మహారాష్ట్రకు పసుపు లోడుతో వెళ్తున్న లారీని డీసీఎం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో డీసీఎం క్యాబిన్‌లో ఉన్న రామకృష్ణ, చిన్న లక్ష్మన్న అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ ఏసోపు, జమన్నకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ఏసోపుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

తాడూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గురువారం ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మయ్య (50) మేస్త్రీ పనిచేస్తూ జీవించేవాడు. గురువారం మండలంలోని గుంతకోడూరులో పనికి వెళ్తుండగా గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లక్ష్మయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ధర్మవరం స్టేజీ సమీపంలో వృద్ధురాలు..

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన గురువారం కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ కథనం మేరకు.. ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి చెందిన గోవిందమ్మ (80) మతిస్థిమితం కోల్పోయింది. గురువారం తెల్లవారుజామున ధర్మవరం స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కల్వకుర్తి టౌన్: గుర్తు తెలియని ఓ వ్యక్తి (46) పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్‌లో ఉన్న బీసీ గురుకుల పాఠశాల పక్కన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. గురువారం ఉదయం అటుగా పొలాలకు వెళ్తున్న రైతులు గుర్తించి సమాచారం ఇవ్వగా సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు వివరించారు. మృతదేహాన్ని కిందకు దించి ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టంకు తరలించామని.. వివరాలకు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో లేదా ఎస్ఐ సెల్‌ఫోన్ నంబర్ 87126 57752 సంప్రదించాలని సూచించారు.


మద్యం అనుకుని పురుగు మందు తాగి వ్యక్తి మృతి



మృతుడు లక్ష్మన్న

చిన్నచింతకుంట: మద్యం అనుకుని పురుగుమందు తాగాడు ఓ వ్యక్తి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నచింతకుంట మండలం అమ్మపూరంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆర్.శేఖర్ తెలిపిన వివరాలు.. అమ్మపూరం గ్రామానికి చెందిన పంచాగం వడ్డే లక్ష్మన్న(42) కూలి పనులు చేస్తూ వచ్చే డబ్బుతో రోజూ మద్యం తాగేవాడు. బుధవారం మత్తులో ఉండి ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. కాసేపటికి అతనే గుర్తించి, కూలీపనికి వెళ్లిన కొడుకు గంగాధర్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. గ్రామస్తులకు తెలియడంతో వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కొడుకు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐ కొట్టారని సీఐకి ఫిర్యాదు



నాగర్‌కర్నూల్ క్రైం: ఎస్ఐ విజయ్‌కుమార్ తనను అకారణంగా కొట్టారని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అనుచరుడు నాగనూలుకు చెందిన కృష్ణారెడ్డి నాగర్‌కర్నూల్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ఓ కేసు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు రావాలని కానిస్టేబుల్ ఉదయం ఇంటికి వచ్చి తీసుకెళ్లారని.. ఠాణాకు వెళ్లాక ఎస్ఐ తనను అకారణంగా కొట్టారని వివరించారు. ఈ విషయాన్ని సీఐ వద్ద ప్రస్తావించగా విచారణ చేపడుతున్నట్లు జవాబిచ్చారు.

శిథిల పిడుగు

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు

- పలుచోట్ల ప్రధాన పిల్లర్ల వద్ద నెర్రెలిచ్చిన భవనం
- గతేడాది సాక్షిలో వచ్చిన కథనంతో మరమ్మతు పనులకు ఎస్టిమేషన్ ఇచ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- నేటికీ ప్రారంభానికి నోచుకోని పనులు
- రాష్ట్రంలోనే అత్యధిక మంది చదువుతున్న కళాశాలగా రికార్డు



మహబూబ్‌నగర్ బాలికల కళాశాలలో ఊడిపడిన పైకప్పు పెచ్చులు

సుమారు 70 ఏళ్ల కింద నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరి గదుల్లో పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి.. దీనికితోడు పిల్లర్లు సైతం నెర్రెలిచ్చి ఎప్పుడు కూలిపడుతుందో తెలియని పరిస్థితి దాపురించింది.. ఈ క్రమంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భవనం మరింత దెబ్బతిని ప్రమాదకరంగా మారగా.. ఇందులో దాదాపు 2,200 మందికి పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఫలితంగా వీరందరిపై శిథిల పిడుగు పొంచి ఉన్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా అనిపించకపోవడం గమనార్హం.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనం నిర్మించి 70 ఏళ్లకుపైగా కావడంతో కళాశాల శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో విద్యార్థినులు తీవ్ర భయాందోళన మధ్య చదువులు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థినులను ఇంటికి పంపించారు. అయితే మధ్యాహ్నం కళాశాలలో పలుచోట్ల పెచ్చులూడి కింద పడింది. కళాశాలలో మొత్తం అన్ని గ్రూపుల్లో కలిపి 2,200 మందితో రాష్ట్రంలోనే అత్యధిక మంది బాలికలు చదువుతున్న జూనియర్ కళాశాలగా రికార్డు సృష్టించింది. మొదటి సంవత్సరంలో 1,300 మంది ఉండగా.. ద్వితీయ సంవత్సరంలో 900 మంది ఏన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కళాశాల భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు నుంచి వర్షపు నీరు లీకవడం, పెచ్చులు ఊడిపడుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల కళాశాల ముందు రోడ్డు విస్తీర్ణం చేపట్టడంతో కాంపౌండ్ చాలా వరకు కూలిపోయింది. దీంతో ఎవరు ఎటు నుంచి వస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వర్షం కురిసిన ప్రతిసారి ఏం జరుగుతుందో అన్న భయంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు.

రూ.16 లక్షలతో ఎస్టిమేషన్..

గతేడాది వర్షాకాలం ప్రారంభంలో కళాశాలలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి'లో వచ్చిన కథనాలకు అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ స్పందించి పరిష్కరించేలా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో వారు కళాశాలను పరిశీలించి మరమ్మతు చేసేందుకు రూ.16 లక్షలతో ఎస్టిమేషన్ ఇచ్చారు. చాలాచోట్ల భవనానికి మరమ్మతు చేసినా తిరిగి వినియోగించేందుకు అవకాశం లేదని అధికారులు తేల్చారు. అయితే నిధులు నేరుగా జిల్లా అధికారులు కానీ, ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి కానీ ఖర్చు పెట్టే అవకాశం లేకపోయింది. దీంతో అప్పట్లో ఇంటర్మీడియట్ బోర్డుకు కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ నిధులు విడుదల చేయాలని లిఖితపూర్వకంగా కోరినా ఇప్పటికీ మంజూరు కాలేదు. వేలాది మంది చదువుతున్న కళాశాల భవనంపై ఇటు ప్రభుత్వం, అటు అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్పందన లేదు..

> రెండు, మూడు సంవత్సరాలలో అనేకసార్లు ఇంటర్మీడియట్ బోర్డుకు లెటర్లు పెట్టాం. గతేడాది ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం ఎస్టిమేషన్ ఇచ్చారు. ఆ నిధుల మంజూరుకు కూడా లెటర్ పెట్టినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. వర్షం పడితే ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.
>
> – కౌసర్ జహాన్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్



కళాశాల తరగతి గదిలోకి చేరిన వర్షపు నీరు





పెచ్చులూడి, నెర్రెలిచ్చిన ప్రధాన పిల్లర్లు

శిథిలావస్థలో ఉన్న భవనాల లెక్క తేల్చండి

- డీఈఓ రవీందర్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'భయం గుప్పెట్లో బడులు' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ ఎంఈఓలు, హెచ్‌ఎంలతో జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో గదులు శిథిలావస్థలో, కులిపోయే పరిస్థితిలో ఉన్న తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగదులు తదితర వివరాలను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితిలో గదులు ఉన్నాయా? అని ప్రశ్నించగా అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో సాక్షి దినపత్రిక కథనాన్ని చూపిస్తూ అధికారుల వద్ద కన్న రిపోర్టర్లతో సమాచారం ఎక్కువ ఉందని మండిపడ్డారు. మన ఊరు–మన బడితో సంబంధం లేకుండా ఇతర మార్గాల ద్వారా నిధులు సమకూర్చి పనులు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థికి కూడా ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సెలవులపై వెళ్లిన వివరాలను ప్రతి నెల నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలుయాదవ్, శ్రీనివాస్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్



హాజరైన ఎంఈఓలు, హెచ్‌ఎంలు

నల్లమలలో తప్పిపోయిన మహిళ

- ఒకరోజు తర్వాత ఆచూకీ లభ్యం



పోలీసులు, అటవీశాఖ సిబ్బందితో భీమమ్మ

అచ్చంపేట రూరల్: నల్లమల అటవీప్రాంతంలో పశువులను మేపేందుకు వెళ్లిన ఓ మహిళ తప్పిపోయింది. మండలంలోని ఏజెన్సీ ప్రాంతం సిద్దాపూర్‌కు చెందిన కొమ్ము భీమమ్మ భర్త నర్సింహతో కలిసి పశువులను మేపడానికి బుధవారం ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం వేళ తిరిగి పశువులను తీసుకుని వస్తుండగా ముందుగా భర్త నర్సింహ వచ్చాడు. వెనకాల ఉన్న భీమమ్మకు దారి దొరకకా అటవీప్రాంతంలో ఉండి పోయింది. గమనించిన భర్త ఇంటి వద్దకు వచ్చి వెతికాడు. గురువారం ఉదయం సిద్దాపూర్ పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా మహిళను గుర్తించి సిద్దాపూర్‌కు తీసుకొచ్చారు.

ఎస్‌వీఎస్‌లో ఎంఆర్ఐ మిషన్ ప్రారంభం



ఎంఆర్ఐ మిషన్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ (ఇంజినియా 3టెస్లా)ను గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ కేజేరెడ్డి మాట్లాడుతూ ఈ మిషన్ కృత్రిమ మేధస్సును కలిగి ఉంటుందని, చిత్ర నాణ్యత కలిగి ఉందన్నారు. స్కాన్ వ్యవధి 5నుంచి 7నిమిషాల మధ్యలో పూర్తి కావడంతో రోగికి ఆందోళన తగ్గుతుందన్నారు. మెదడు, వెన్నుముక, ఎముకలు, కీళ్లు, గుండె, రక్తనాళాలు, గర్భాశయం, కాలేయం ఇలా మొదలైన అంతర్గత అవయవాలను ఎంఆర్ఐ స్కాన్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ



గట్టు: గట్టు గ్రామంలోని శ్రీ అంబాభవాని ఆలయంలో హుండీ చోరీ చేశారు. గట్టు సంత బజారులోని ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాన్ని విరగ్గొట్టి ఆలయంలోని హుండీని అపహరించారు. ఉదయం గుడికి వెళ్లిన పూజారి నాగరాజు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ మహేశ్వర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూజారి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ మహేశ్వర్ తెలిపారు.

5, 6 తేదీల్లో వాలీబాల్, త్రోబాల్ జిల్లాస్థాయి పోటీలు



మాట్లాడుతున్న డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: వచ్చేనెల 5, 6 తేదీల్లో జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం పేరిట దక్షిణభారత దేశం అంతటా క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు జిల్లాలోని మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ, జడ్చర్ల, భూత్పూర్, నవాబ్‌పేట మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్లపైబడి పురుషులు వాలీబాల్, 13 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపు మహిళల్లో కేవలం ముగ్గురు, 21 ఏళ్లపై బడిన మిగతా మహిళలు త్రోబాల్ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని, జిల్లాస్థాయిలో నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేస్తామన్నారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో విన్నర్, రన్నర్ జట్లు రాష్ట్రస్థాయి పోటీలకు వెళతాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన జట్లు కోయంబత్తూర్‌లో జరిగే సౌతిండియా పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఎంపిక చేసిన మండలాల నుంచి క్రీడా జట్లు తమ పేర్లను ఈనెల 25 వరకు నమోదు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల జట్లు http://Isha.co/gramotsavam వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మిగతా సమాచారం కోసం 9490415087, 9347697882, 9492753534 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సహించడం కోసం క్రీడాపోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. క్రీడాపోటీల విజయవంతం కోసం తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఈషా ఫౌండేషన్ వలంటీర్లు గిరిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, బస్వంత్‌రెడ్డి, భార్గవ్ సత్య, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, పీడీ, పీఈటీలు జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, గజానంద్‌కుమార్, సూర్యప్రకాశ్‌రావు, రాంకళ్యాణ్‌జీ, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

ఆత్మకూర్: భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న పీనం ఎల్లప్ప, సంధ్య(లక్ష్మి) దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. వీరు కొన్ని రోజులుగా గొడవలు పడుతుండేవారు. గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సంధ్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలకు తాళలేక కేకలు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 13వ తేదీన మృతి చెందింది. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు ఎల్లప్పను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించారని ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. పట్టణంలోని దేవరకొండ రోడ్డులో బుధవారం రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ శేఖర్‌ను పరీక్షించగా అధిక మోతాదులో మద్యం తాగినట్లు తేలింది. అతన్ని గురువారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి చార్లెస్‌రాజు అతనికి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారని ఎస్ఐ చెప్పారు.

నదీతీరాలకు ప్రజలు వెళ్లొద్దు



మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కృష్ణానదికి ఎగువన భారీగా వరద చేరుతోందని, దీంతోపాటు దిగువకు వదిలే అవకాశం ఉందని తెలిపారు. చేపలు పట్టేవారు, పుట్టి నడిపేవారు వెళ్లవద్దని చెప్పారు. వ్యవసాయం విద్యుత్ మోటార్లను నదిలో నుంచి బయటికి తీయాలని చెప్పారు. మక్తల్ నియోజకవర్గం కృష్ణా, మాగనూర్, నర్వ, మక్తల్, అమరచింత, ఆత్మకూర్ పరిధిలో నదీతీర గ్రామాల ప్రజలు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండవద్దని అన్నారు. మరో రెండ్రోజులు వర్షాలు అధికంగా ఉన్నాయని అన్నారు. ఆయనవెంట మహిపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, నేతాజీరెడ్డి, ఈశ్వర్‌యాదవ్, శేకర్‌రెడ్డి, గాలిరెడ్డి ఉన్నారు.

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు

- అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- వనపర్తి జిల్లా ఆరేపల్లి వద్ద ఘటన



విడిపోయిన బోగీలను పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది

ఆత్మకూర్: రన్నింగ్‌లో ఉన్న గూడ్స్ రైలు నుంచి బోగీలు విడిపోయిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం ఉదయం కర్నూలు వైపు నుంచి సికింద్రాబాద్ వైపు ఓ గూడ్స్ రైలు వెళుతుండగా.. 11.15గంటల సమయంలో దానికి సంబంధించిన బోగీలు విడిపోయాయి. ఇది గమనించకపోవడంతో ఇంజన్ ఇంచార్జ్ రైలును అలాగే ముందుకు తీసుకెళ్లాడు. వెంటనే అప్రమత్తమైన గూడ్స్‌రైలు గార్డు వాకీ టాకీ ద్వారా లోకో పైలెట్‌కు సమాచారం అందించడంతో అప్రమత్తమయ్యారు. సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు గూడ్స్ రైలు ముందుకు వెళ్లిపోయింది. వెంటనే ఇంజన్‌ను ట్రాక్‌పై వెనక్కి తీసుకొచ్చి బోగీలను జోడించుకుని 20 నిమిషాల్లో మళ్లీ ముందుకు బయల్దేరింది. ఘటన జరిగిన సమయంలో గుంటూరు, తుంగభద్ర రైళ్లు రావాల్సి ఉండగా.. ముందస్తు సమాచారంతో వాటిని కాసేపు నిలిపివేశారు. బోగీలకు మధ్య ఉన్న హెయిర్‌పంపు కప్ లింగ్ ఊడిపోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఆర్‌ఏఎస్ పద్ధతితో అధిక లాభాలు



ఆర్‌ఏఎస్ పద్ధతిలో చేపల పెంపకాన్ని వివరిస్తున్న రైతు విశ్వనాథరాజు

బాలానగర్: తక్కువ నీరు, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ చేపలు పెంచే ఆర్‌ఏఎస్ పద్ధతి ఎంతో లాభసాటిగా ఉంటుందని సీఎస్ఆర్ఎం సీసీడీఎం– ఎన్ఐఆర్ డీపీఆర్ డైరెక్టర్ రవీంద్ర గోవాలి అన్నారు. గురువారం మండలంలోని జీడిగుట్టతండా రైతు విశ్వనాథరాజు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఏఎస్ ఆక్వా పద్ధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా రైతు విశ్వనాథరాజు నూతనంగా బాధ్యతలు చేపట్టబోతున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన 2వ బ్యాచ్ 38 మంది ఏఎఫ్ఓలకు ఆర్‌ఏఎస్ ఆక్వా, కంపోస్టు ఎరువులను తయారు చేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఎలాంటి వ్యర్థాలనైనా సరే ఉపయోగించి కంపోస్టు ఎరువులను తయారు చేసే పద్ధతి, తద్వారా ఆదాయాన్ని ఏ విధంగా రాబట్టుకోవాలనే అంశాల గురించి వివరించారు. అనంతరం ఉడిత్యాలను సందర్శించిన గ్రామంలోని మహిళా సంఘాల స్థితిగతులు, ఆదాయం, జీవనశైలి తదితర వాటిపై అధ్యయనం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని సగటు వ్యక్తి ఆదాయం, ఆధారపడిన వృత్తి, ప్రధాన ఆదాయ వనరుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రొఫెసర్ ప్రదీప్, శబ్రత్, సోనల్ రాయ్, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కృష్ణారావు, ఆర్ఐ రాజేశ్వరి, ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లేష్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యులు ప్రదీప్, నీల్యానాయక్ పాల్గొన్నారు.

స్పందించని 108

- ఫోన్ చేసినా సమాధానం ఇవ్వనం వైనం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో అల్లాడిన విద్యార్థిని



గండేడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

గండేడ్: మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన అఖిల వెన్నాచేడ్ మోడల్ పాఠశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. రాత్రి 9గంటల ప్రాంతంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. ఏఎన్ఎం అంజలి ఆమెను పరిశీలించగా, కేర్ టేకర్ వీణ 108కు ఫోన్‌చేయగా ఫోన్ రింగ్ అయినా ఎవరు కూడా స్పందించలేదు. స్థానికులకు తెలియడంతో వారు ఫోన్ చేసినా లాభం లేకపోయింది. దీంతో స్థానికుల సాయంతో ఆటోలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యార్థినిని తరలించారు. గతేడాది కూడా ఈ అమ్మాయి ఇదేవిధంగా ఇబ్బందిపడినా అంబులెన్స్ రాక అవస్థ పడింది. విద్యార్థిని పరిస్థితిపై మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. సిబ్బందికి అప్రమత్తం చేసి ఆక్సిజన్ అమర్చినట్లు తెలిపారు. 108 సిబ్బంది స్పందించకపోవడం ఏమిటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తపరిచారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

పాలమూరు: రాష్ట్రంలో చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్ ఉంటే ప్రస్తుతం రూ.లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. హౌజింగ్‌బోర్డు తొలగించి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడంతోపాటు గెస్ట్ లెక్చరర్లతో పనిచేయించుకుని సక్రమంగా జీతాలు ఇవ్వలేదని, వీఆర్‌ఏలతోపాటు ఆర్టీసీ కార్మికులను ఇబ్బందులకు గురిచేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ప్రతి శాఖలో ఇదే విధంగా దాపురించిందన్నారు. స్కూల్ స్వీపర్లు, పీఈటీ అభ్యర్థులు, కేజీబీవీ ఉపాధ్యాయల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.